ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0 | కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5
జోగులాంబ
గద్వాల
జిల్లా వార్తలు
బుధవారం 14 ఆగస్టు 2024



జ్వర పీడితులు

- సర్కారు దవాఖానాలకు క్యూ కడుతున్న బాధితులు
- అధికంగా నమోదవుతున్న డయేరియా కేసులు
- కిట్ పద్ధతిలో పాజిటివ్ వస్తున్న డెంగీ.. మాక్ఎలిజా ప్రామాణికం
- పలు జిల్లాల్లో చికున్ గున్యాతో సతమతమవుతున్న రోగులు
- కలుషిత నీరు, దోమల ప్రభావమే కారణమంటున్న వైద్యులు



వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలైన్లో ఉన్న జ్వరపీడితులు



పాలమూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఓపీ కోసం క్యూలైన్లలో ఉన్న రోగులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైరల్ ఫీవర్ల కారణంగా ప్రజలు సతమతమవుతున్నారు. మెజారిటీ ఆసుపత్రుల్లో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రధానంగా ప్రభుత్వాస్పత్రులకు వచ్చే వారు అధికంగా ఉంటున్నారు. వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన లేకపోవడంతో ఈసారి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వచ్చే ఔట్ పేషెంట్లలో 80 శాతం వరకు జ్వరపీడితులే ఉంటున్నారు. డెంగీ,చికున్ గున్యా తదితర కేసులు కూడా పలుచోట్ల నమోదవుతున్నాయి. డెంగీ కేసులకు సంబంధించి ప్రతీరోజు రక్త కణాలు తగ్గుతున్న వారి నమూనాలను సేకరించి.. టీ హబ్‌లకు పంపిస్తుండగా.. కిట్ పద్ధతిలో మెజారిటీ రోగులకు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోంది. అయితే వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం డెంగీ కేసుల నిర్ధారణలో కిట్ పద్ధతి కాకుండా మాక్ఎలిజా (ఎన్ఎస్1, ఐజీఎం, ఐజీజీ) పరీక్ష ప్రామాణికంగా తీసుకుంటుండటంతో.. ఈ పద్ధతిలో పాజిటివ్ కేసుల సంఖ్య తక్కువగా ఉంటోందని చెప్పవచ్చు. మాక్ ఎలిజా టెస్టుల్లో నిర్ధారణకాని డెంగీ కేసులను కేవలం అనుమానిత కేసులుగానే గుర్తిస్తున్నారు. వానాకాలం కావడంతో నిల్వ నీరు అధికంగా ఉండి.. దోమల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. పట్టణాల్లో ఖాళీ ప్లాట్లు, రోడ్ల వెంట గుంతల్లో దోమల వ్యాప్తి విపరీతంగా జరుగుతోంది. బురద గుంటల్లో విడుదల చేసే గంబూజియ చేపలను ఈసారి అనుకున్న స్థాయిలో విడుదల చేయలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉంటోంది. ప్రస్తుతం అన్ని ఆసుపత్రుల్లో కావాల్సిన మందులు అందుబాటులో ఉండటంతోపాటు.. ఇన్‌పేషెంట్‌కు బెడ్లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఓపీకి వచ్చే జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉండటంతో.. ఆసుపత్రుల వద్ద క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి.. చికిత్స చేయించుకుంటున్నారు.



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఐపీ విభాగంలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

డయేరియా కేసులే అధికం..

ఉమ్మడి పాలమూరులోని ప్రతీ జిల్లాలో డయేరియా కేసులే అధికంగా నమోదవుతున్నాయి. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని నాయకులు చెబుతున్నప్పటికీ.. కలుషిత నీటిని తాగడం వల్ల నమోదయ్యే డయేరియా కేసులే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2023 సంవత్సరంలో నాలుగు వేలకు పైగా డయేరియా కేసులు నమోదు కాగా.. ఈ సంవత్సరం ఒక్క నారాయణపేట జిల్లాలోనే 8,663 కేసులు నమోదయ్యాయి. వనపర్తిలో 558, నాగర్‌కర్నూలులో 133, గద్వాలలో 143 కేసులు నమోదుకాగా.. మహబూబ్‌నగర్‌లో దాదాపు వెయ్యికి పైగా డయేరియా కేసులు నమోదయినట్లు తెలుస్తోంది. తక్కువగా నమోదు ఉన్న జిల్లాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ చేసి చూపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డయేరియా కారణంగా వాంతులు, విరేచనాలు అధికంగా ఉంటాయి. రోగులు డీహైడ్రేషన్‌కు కూడా గురవుతున్నారు. జ్వరం ఎక్కువై.. ఇతరత్రా సమస్యలకు దారి తీస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అలాగే కలుషిత నీటి వల్ల చర్మ వ్యాధుల సంఖ్య తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా కృష్ణానది నీరు అధికంగా సరఫరా అవుతోంది. ప్రస్తుతం కొత్త నీరు వస్తున్న క్రమంలో ఒండ్రు ప్రభావం నీటిలో ఎక్కువగా ఉంటుంది. నిల్వ నీటిలో ఒండ్రు కిందకు జారిపోవడం ద్వారా నీరు తేటగా మారుతుంది. ప్రస్తుతం భారీ వరదలు వస్తున్న క్రమంలో నీటిశుద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకో వాల్సి ఉన్నప్పటికీ.. సరైన పద్ధతిలో మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల వద్ద నీటి శుద్ధి జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. క్లోరినేషన్ ప్రక్రియతోపాటు ఆలం ముక్కలు వేయడం, ఫిల్టర్‌బెడ్లు, నీటి ట్యాంకులను సరైన సమయంలో శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు దురద, వాంతులు, విరేచనాల బారిన పడుతున్నారు. ప్రతీఏటా సరైన పద్ధతిలో మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, స్టోరేజీ ట్యాంకుల వద్ద పరిశుభ్రత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డెంగీ, చికున్ గున్యా కేసులు కూడా..

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జీజీహెచ్‌లకు వచ్చే కేసుల్లో జ్వర పీడితులు అధికంగా ఉంటున్న నేపథ్యంలో అధికారులు జ్వర లక్షణాలు బట్టి డెంగీ, చికున్ గున్యా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు ఈ సంవత్సరం 86 డెంగీ కేసులు నమోదయ్యాయి. 11 చికున్ గున్యా కేసులను నిర్ధారించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2023లో 184 డెంగీ కేసులు నమోదు కాగా.. 2024లో ఇప్పటి వరకు 14 కేసులు మాక్ ఎలిజాలో పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. వనపర్తి జిల్లాలో 2023లో 19 కేసులు నమోదు కాగా.. 2024లో ఇప్పటి వరకు 10 కేసులు నమోదయ్యాయి. చికున్ గున్యా కేసులు గతేడాది ఒక్కటి కూడా నమోదు కాలేదు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు 17 కేసులు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లాలో డెంగీ కేసులు గతేడాది 38 నమోదు కాగా.. 2024లో 11 కేసులు వచ్చాయి. ఒక మలేరియా కేసు కూడా ఇక్కడ నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది 27 డెంగీ కేసులు నమోదుకాగా.. ఈ ఏడాది ఇప్పటివరకు ఏడు కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్ కేసులు కూడా వందల సంఖ్యలో నమోదవుతున్నాయి. మునిసిపాలిటీలు, నదీపరివాహక ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉండటంతో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కాచి, వడపోసిన నీటిని తాగడం, నిల్వ ఉన్న నీటిని పారబోయడం, వ్యక్తిగత స్టోరేజీ ట్యాంకులను క్లీన్ చేసుకోవడం ద్వారా డయేరియాతోపాటు వైరల్ ఫీవర్స్‌ను అరికట్టే అవకాశం ఉంటుంది.


శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో
పురోగతి లేదు

- పోలీసు యంత్రాంగంపై మాజీ మంత్రి ఆగ్రహం
- త్వరలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన నిరంజన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

చిన్నంబావి, ఆగస్టు 13: శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో పురోగతి లేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని లక్ష్మీపల్లి గ్రామంలో బొడ్డు శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి మూడు మాసాలైన పోలీసు అధికారులు కేసులో నిందితులను ఇప్పటి వరకు గుర్తించకపోవడం విడ్డూరమని అన్నారు. హత్య కేసులో వారి తల్లిదండ్రులు కొందరిని అనుమానితులుగా ఫిర్యాదు చేసినా, సదరు వ్యక్తుల పేర్లు తొలగించాలని పోలీసులు కోరడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేసులో ఎలాంటి పురోగతి లేదని, నిజాలను నిగ్గుతేల్చకపోతే త్వరలో డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. హత్య కేసు ఛేదనలో పోలీసు అధికారులు అమాయకులను విచారణ పేరుతో వేధిస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కానీ బాధిత కుటుంబ సభ్యులు సూచిస్తున్న వ్యక్తులను విచారించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో హత్య జరిగితే ఓ మంత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా హత్యకు గురైన వ్యక్తిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కేసును నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ హత్య కేసుపై డీజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిట్‌పై నమ్మకం ఉందని త్వరగా కేసును ఛేదించాలని కోరారు. నియోజకవర్గ మంత్రి తన కనుసన్నల్లో ఉండే పోలీసు అధికారులకు పోస్టింగ్ ఇచ్చి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వెంకట్రామమ్మ, బీఆర్ఎస్ నాయకులు రంగినేని అభిలాష్ రావు, చిన్నారెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఎస్ ప్రాజెక్టు

ఆర్డీఎస్‌పై..
తుంగభద్ర గేటు ఎఫెక్ట్

- మరమ్మతుల కోసం నీటి సామర్థ్యం తగ్గింపు
- వర్షాలు వచ్చి డ్యాం నిండితేనే పూర్తి ఆయకట్టుకు నీరు

గద్వాల, ఆగస్టు 13 : వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్న వేళ, ఆయకట్టు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో కొత్త సమస్య వచ్చిపడింది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడం ఆర్డీఎస్ ఆయకట్టు రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గేటు పునరుద్ధరణ పనులు చేపట్టాలంటే డ్యాంలో నీటి నిల్వను తగ్గించాలన్న నిపుణుల సూచనలు మరింత ఆందోళనకు గురి చేశాయి. ఈ డ్యాంపై కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కూడా ఆధారపడి ఉండటంతో ఇది ఉమ్మడి రాష్ట్రాల సమస్యగా మారింది. తుంగభద్ర డ్యాం నుంచి ఆర్డీఎస్‌కు 6.51 టీఎంసీల వాటా ఉండటంతో, ఇక్కడి రైతులపై తీవ్ర ప్రభావం చూపనున్నది. ఆర్డీఎస్ కింద డి-12 నుంచి డి-23 వరకు వరినాట్లు వేసుకునే పనిలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం నీటి పారుదలకు ఇబ్బందులు లేకపోయినా, పరిస్థితి ఇలానే ఉంటే పంటల చివరి దశలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. డి-24 నుంచి డి-40 వరకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ఉన్నప్పటికీ సుంకేసులలో నీటి నిల్వలు తగ్గుతూ ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఒత్తిడిలు పెరిగే అవకాశం లేకపోలేదు.

ఆర్డీఎస్ వాటా

15.90 టీఎంసీలు

రాజోళిబండ డైవర్షన్ స్కీం ద్వారా తెలంగాణ నీటి వాటా 15.90 టీఎంసీలు. ఇందులో నదికి వచ్చే ఇన్‌ఫ్లో ద్వారా 9.39 టీఎంసీలు కాగా, తుంగభద్ర డ్యాం నుంచి ఇండెంట్‌తో 6.51 టీఎంసీలు వాడుకొని 87,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పారించాలి. కానీ ఇప్పుడు తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో తుంగభద్ర డ్యాం నుంచి తీసుకునే 6.51 టీఎంసీల వాటాపై ప్రభావం ఉంటుంది. దీని వలన ఆర్డీఎస్ కింద సాగుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఆర్డీఎస్ రైతులను ఆదుకునేందుకు నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతలపైనా ప్రభావం పడుతుంది. ఎందుకంటే ఆ వాటా నుంచే మనం నీటిని వాడుకుంటున్నాం. తుంగభద్ర డ్యాంలో ఉండే నీటి నిల్వల ఆధారంగానే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో నీటి కేటాయింపులు చేస్తారు. డ్యాంలో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు లేకపోతే ఆర్డీఎస్‌కు వచ్చే నీటి కేటాయింపు తగ్గిపోయే అవకాశం ఉంది. తుంగభద్ర గేట్ల మరమ్మతు కోసం డ్యాం కెపాసిటీని తగ్గించాలని నిపుణులు సూచించడంతో డ్యాం గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యాం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా, దానిని 40 టీఎంసీల మేరకు తగ్గించేందుకు అధికారులు లక్ష క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

మళ్లీ వర్షాలు కురిసి వరదలు వస్తే...

తుంగభద్ర డ్యాం కెపాసిటీని తగ్గించి గేట్ల మరమ్మతులు పూర్తి చేసిన తర్వాత మళ్లీ వర్షాలు వస్తేనే తుంగభద్ర డ్యాం పూర్తి సామర్థ్యంతో నిండే అవకాశం ఉంది. ప్రస్తుతం తుంగ, భద్రలతో పాటు ఎగువ కృష్ణా పరివాహకంలో వర్షాలు పూర్తిగా నిలిచిపోయాయి. లానినో ప్రభావంతో సెప్టెంబర్‌లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పటి వరకు తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతులు పూర్తి చేస్తే మళ్లీ 105 టీఎంసీలు నింపుకునే అవకాశం ఉంది. అప్పుడు సాగుపై ఎలాంటి ప్రభావం చూపదు. వచ్చే వర్షాలపైనే సాగు నీటి పారుదల పంటల పరిస్థితి ఆధారపడి ఉంది.

మల్లమ్మకుంట చిన్నోనిపల్లి నిర్మించి ఉంటే..

ఆర్డీఎస్‌కు 15.90 టీఎంసీల కేటాయింపులు ఉన్నప్పటికీ ఎప్పుడు కూడా ఐదు టీఎంసీల నుంచి ఆరు టీఎంసీల నీటిని వాడుకోలేని పరిస్థితి ఉంది. తుమ్మిళ్ల ప్రాజెక్టు నిర్మించిన తర్వాత కర్ణాటక నుంచి వచ్చే ఆర్డీఎస్ కాలువ నీటితో కలుపుకుంటే ఎనిమిది టీఎంసీలను కూడా వాడుకోలేదని లెక్కలు చెబుతున్నాయి. ఇప్పుడు తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోడంతో ఆర్డీఎస్ మళ్లీ వార్తల్లో నిలిచింది. ఆర్డీఎస్ రైతులపై ప్రభావం చూపుతుండటంతో మల్లమ్మకుంట, చిన్నోనిపల్లి రిజర్వాయర్ల గురించి చర్చ వస్తున్నది. చిన్నోనిపల్లి రిజర్వాయర్ ద్వారా ఆర్డీఎస్ లింక్ కెనాల్‌ను కలిపి ఉంటే ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనే అవకాశం ఉండేదని రైతులు అంటున్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి ఆర్డీఎస్‌కు లింక్ చేయాలని, అప్పటి ప్రభుత్వం ఆదేశించి చిన్నోనిపల్లి గ్రామాన్ని ఖాళీ చేయించే పనిచేసింది. గ్రామస్థులు ఎదురుతిరగడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇక తుమ్మిళ్ల ప్రాజెక్టులో భాగంగా నిర్మించే మల్లమ్మకుంట రిజర్వాయర్ భూసేకరణ జరగకపోవడం, అందులో ముంపునకు గురయ్యే భూమలన్నీ దళిత, పేద సామాజికవర్గాల భూములు ఉండటంతో ఉపాధి కరువైతుందని అడ్డుకుంటున్నారు. దీంతో భూసేకరణ కష్టంగా మారింది. ఇలా ఆర్డీఎస్ కింద సాగు చేస్తున్న రైతులకు అన్నీ కష్టాలే ఎదురౌతున్నాయి.

ప్రస్తుతం సాగునీటికి ఢోకాలేదు

విజయ్‌కుమార్‌రెడ్డి ఈఈ ఆర్డీఎస్, గద్వాల : ప్రస్తుతం ఆర్డీఎస్ కింద సాగునీటికి ఢోకాలేదు. ఆర్డీఎస్ ద్వారా డి-25 వరకు నీళ్లు వస్తున్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి దామాషా పద్ధతిలో నీటి కేటాయింపులు ఉంటాయి. సెప్టెంబర్‌లో వర్షాలు వచ్చే అవకాశం ఉంది. డ్యాం నిండితే యధావిధిగా ఇండెంట్ ప్రకారం నీళ్లు వస్తాయి. వర్షాభావ పరిస్థితులు ఉంటే నీటి వాటా కేటాయింపు తగ్గుతుంది. ఆర్డీఎస్ కాలువ 109 కిలోమీటర్ వద్ద తెగిపోవడంతో తుమ్మిళ్ల ఎత్తిపోతలు నిలిచిపోయాయి. పనులు జరుగుతున్నాయి. మూడు రోజులలో తిరిగి పంపులను స్టార్ట్ చేస్తాం.

పోలీసుల అదుపులో
చోటేమియా



చోటేమియా (ఫైల్)

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీ ఆశ చూపి జనాన్ని మోసగించిన చోటేమియా పోలీసుల అదుపులో ఉన్నాడు. తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన చోటేమియా అతని బంధువులు, స్నేహితులకు అధిక వడ్డీ ఆశ చూపి దాదాపు రూ.5 నుంచి రూ.6కోట్ల వరకు కుచ్చుటోపి వేసిన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో 15రోజుల క్రితం నాగర్‌కర్నూల్‌కు వచ్చిన చోటేమియా అందరికీ తాను తీసుకున్న డబ్బులు చెల్లిస్తానని భరోసా ఇచ్చి రెండురోజుల వ్యవధిలోనే పలాయనం చిత్తగించాడు. ఈ క్రమంలో బాధితులు ఎస్పీని, స్థానిక ఎమ్మెల్యేను ఆశ్రయించారు. చోటేమియా భార్య కూడా పోలీస్‌స్టేషన్‌లో తన భర్తపై మిస్సింగ్ కేసు పెట్టింది. ఈ క్రమంలో చోటేమియా మంగళవారం ఉదయం 11గంటలకు సీఐ కనకయ్య దగ్గర లొంగిపోయాడు. విషయాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిర్ధారించారు. అధిక వడ్డీ పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది.



నాగర్‌కర్నూల్ జిల్లా.. కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద రైతులు సాగు చేసిన పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఒక వైపు పచ్చని పంటలు.. మరోవైపు కృష్ణమ్మ పరవళ్లను చూసి పర్యాటకులు ఆనందంతో పరవశించిపోతున్నారు.
- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

కదిలిన యంత్రాంగం

- వసతి గృహాలను పరిశీలిస్తున్న అధికారులు
- కోడూరులో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్
- కోయిలకొండలో ఏసీబీ అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కోడూరు కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 : వసతి గృహాల్లో నాసిరకమైన భోజనంతో ఎంతో మంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఇదే విషయమై ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో 'ఫుడ్‌పాయిజన్' శీర్షికన కథనం వెలువడంతో అధికార యంత్రాంగం కదిలింది.. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వసతి గృహాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం ఏసీబీ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో కలిసి కోయిలకొండ బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ విజయేందిర బోయి కోడూరు కేజీబీవీని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మరోవైపు మునిసిపల్ కమిషనర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, తహసీల్దార్‌ల బృందం రాంరెడ్డిగూడ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఇలా ఏకకాలంలో అధికారయంత్రాంగం వసతిగృహాలను తనిఖీ చేయడంతో నిర్వాహకులలో టెన్షన్ మొదలైంది.. ఎక్కడికక్కడ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. వరుస తనిఖీలతో వసతిగృహాలలో వసతులు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయి. ఈ మార్పు కారణంగా విద్యార్థులలోనూ ఆనందం వ్యక్తం అవుతోంది.. కోయిలకొండ బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు అక్కడి వసతులు, అందిస్తున్న భోజనంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. నాసిరకం సరుకులున్నాయని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, ఈ విషయాలను డీజీకి రిపోర్ట్ చేస్తానని వెల్లడించడంతో వార్డెన్‌లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీన్ని బట్టి వసతి గృహాల్లో విద్యార్థులకు ఏరకమైన వసతులు అందుతున్నాయో అర్థమవుతోంది. చాలా వసతి గృహాల్లో ఏం జరుగుతుందో బయటకు తెలియని పరిస్థితి నెలకొంది. మీడియాను కూడా అనుమతించకుండా జాగ్రత్తపడుతున్నారు. విద్యార్థులను తమ ఆధీనంలో ఉంచుకుని వారికి సరైన వసతులు కల్పించడం లేదు. వసతి గృహాలకు వచ్చే సరకులలో సగం పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. నాలుగైదు రోజులుగా తనిఖీలు పెరగడంతో వార్డెన్‌లు అక్కడే అంటూ పరిసరాలు, బాత్‌రూమ్‌లను శుభ్రం చేయిస్తూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు. ఈ తనిఖీలు ఇలానే కొనసాగిస్తే వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపడుతాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సరైన వసతులు కల్పిస్తేనే చదువుపై ఏకాగ్రత సాధించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మైనార్టీ బాలికల గురుకులం తనిఖీ చేసిన ఆర్‌ఎల్‌సీ

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 13 : జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల మైనార్టీ బాలికల-1 గురుకులాలను మంగళవారం జిల్లా రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ (ఆర్‌ఎల్‌సీ) ఖాజాబహాద్దీన్ తనిఖీ చేశారు. బోజనశాలలో విద్యార్థులతో మాట్లాడిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. గురుకులాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉంటే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు దృష్టికి తీసుకవెళ్లాలన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎల్‌సీ

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

- విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ

మన్ననూర్, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని, హిందువుల రక్షణకు ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ మన్ననూరులోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై పార్టీలకతీతంగా హిందువులు మంగళవారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించాలని, మారణకాండను ఆపాలని డిమాండ్ చేశారు. హిందూ సంఘాల నాయకులు జూలూరి సత్యనారాయణ, సంభు శ్రీనివాసులు, పులిజాల శేఖర్, నర్సింహచార్యులు , నిరంజన్, శరణ్, సురేష్, తిరుపతయ్య, రాజేందర్‌రెడ్డి , మల్లికార్జున్ పాల్గొన్నారు.

సీడ్స్ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి
- రైతులకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలు అందిస్తాం
- గత ప్రభుత్వం సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసింది
- విత్తన ఉత్పత్తి, రైతుల బకాయిలు త్వరలోనే చెల్లిస్తాం

వనపర్తి టౌన్, ఆగస్టు 13 : గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సీడ్స్ కార్పొరేషన్‌కు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన జిల్లా కేంద్రంలోని విత్తన అభివృద్ధి సంస్థలో రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కొన్ని ప్రైవేటు కంపెనీలు నేడు ఉంటాయి, రేపు పోతాయి కానీ విత్తన కార్పొరేషన్ మాత్రం పర్మినెంట్‌గా ఉంటుందన్నారు. కొన్ని ప్రైవేటు కంపెనీలు సీడ్స్‌ను రైతులకు అందించి అద్భుతాలు చేసినట్లు పెద్ద ఎత్తున ప్రచారాలు చేసుకుంటున్నాయని విమర్శించారు. సీడ్స్ కార్పొరేషన్ మాత్రం నాణ్యమైన విత్తనాలనే తయారు చేసి రైతులకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలనే అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం గడిచిన పదేళ్లలో రైతులకు అందించే సబ్సిడీలను పూర్తిగా ఎత్తేసిందని, దీంతో రైతులు అన్యాయానికి గురయ్యారని తెలిపారు. విత్తన ఉత్పత్తి, రైతులకు రావల్సిన బకాయిలను త్వరలోనే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. విత్తన ఉత్పత్తి దారులైన రైతులకు నష్టం జరగకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని, రైతులు ధాన్యాన్ని దించే సమయంలో చెల్లించే హమాలీ ఖర్చులు రైతుల పై భారం పడకుండా చూస్తామన్నారు. రబీ సీజన్ నుంచి తృణధాన్యాల విత్తనాలు కూడా సీడ్స్ కార్పొరేషన్ ద్వారా రైతులకు అందిస్తామన్నారు. అనంతరం రైతులు, అధికారులతో కలిసి జిల్లాలోని విత్తన అభివృద్ధి సంస్థను పరిశీలించి మొక్కలు నాటారు. అంతకుముందు జిల్లా



సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలను పరిశీలిస్తున్న సుంకేట అన్వేష్‌రెడ్డి

కేంద్రానికి వచ్చిన ఆయనను రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో విత్తన కార్పొరేషన్ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కందులు నాగిరెడ్డి, మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, రాజేంద్రప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్ బ్రహ్మంచారి తదితరులు ఉన్నారు.

దొంగతనం చేస్తుండగా పట్టివేత

- సిబ్బందిని అభినందించిన ఎస్పీ

పెబ్బేరు, ఆగస్టు 13 : వనపర్తి జిల్లా పెబ్బేరు బస్టాండ్ సమీపంలో దొంగలు ఓ షాపులో చోరీ చేస్తుండగా పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పెబ్బేరు మునిసిపల్ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మార్కెట్ యార్డుకు చెందిన షట్టర్లలో నాగరాజుగౌడ్ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ ఆఫీస్ నడుపుతున్నాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు షట్టర్ తాళాలను పగులగొట్టారు. ఇద్దరు లోపలికి వెళ్లి దొంగతనం చేస్తుండగా, మరో వ్యక్తి బయట ఉన్నాడు. పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా షట్టర్ ముందు వ్యక్తి తారసపడ్డాడు. అతని వద్దకు పోలీసులు వెళ్లగా పారిపోయాడు. అనుమానం వచ్చి షట్టర్ వద్దకు వెళ్లి చూశారు. షట్టర్ సగం తెరిచి ఉండడంతో పోలీసులు లోపలికి వెళ్లారు. అప్పటికే ఇద్దరు దొంగలు లోపల ఉండటంతో వారిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ రాములునాయక్, కానిస్టేబుల్ రవికుమార్, హోం గార్డు కర్నాకర్‌గౌడ్, డ్రైవర్ మహేష్‌లను మంగళవారం ఎస్పీ రావుల గిరిధర్ అభినందించి, సన్మానించారు. విషయంపై ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా నేరం జరగకుండా ఆపామని చెప్పారు కానీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తుల వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఎస్పీ అభినందించిన విషయం గుర్తు చేయగా పెబ్బేరులో గతంలో జరిగిన కేసు విషయంలో అభినందించి ఉంటారని అన్నారు.

అవయవ దానంతో సాటి మనిషి ప్రాణాలు కాపాడుదాం

వనపర్తి వైద్యవిభాగం, ఆగస్టు 13 : ఎంతో విలువైన అవయవాలను మరణించిన తరువాత మట్టిలో కలిసిపోకుండా అవయవ దానం చేసి సాటి మనిషి ప్రాణాలను కాపాడాలని అఖిలభారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో అవయవదాన దినోత్సవాన్ని జరుపుకున్నారు. అవయవ దానంపై గూడూరు సీతామహాలక్ష్మి అవగాహన కల్పించారు. సమాజ శ్రేయస్సు కోరి సాటి మనుషులకు అవయవాలను దానం చేయడం అన్ని దానాల్లోకన్నా ఎంతో గొప్పదని అన్నారు. శరీర అవయవాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. మనిషి శరీరంలో నుంచి ఎనిమిది రకాల అవయవాలను దానం చేయొచ్చని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు భారతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్, సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొల్లి ఆదాంరాజ్, విజ్ఞానదర్శిని ఫౌండర్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, ట్రస్ట్ సభ్యురాలు కన్యాకుమారి, డాక్టర్ సంతోషి,



అవయవ దానం గురించి మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

డాక్టర్ బంగారయ్య, సంఘం జిల్లా కన్వీనర్ గంజి కొప్పుల మహేష్, ఆర్మీ కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌యాదవ్, కవి జనజ్వాల, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, ఏసోపు, గంధం భగత్, చంద్రశేఖర్, నందిమల్ల రాములు, గంధం నాగరాజు, శివారెడ్డి, ఉదయ్‌కుమార్, శోభారాణి, బొల్లి భాగ్యమ్మ, మంద ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయం ముందు వంటావార్పు

జడ్చర్ల, ఆగస్టు 13 : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ గడిచిన ఎనిమిది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన మునిసిపల్ కార్మికులు మంగళవారం జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు ఒక పూట విధానాన్ని అమలు చేయాలని, కేటగిరి వారీగా వేతనాలు చెల్లించాలని, కార్మికులు ఇవ్వాల్సిన యూనిఫాం, సబ్బులు, నూనె ఇవ్వాలని కోరారు. దశలవారీగా చేస్తున్న పోరాటంలో భాగంగా మునిసిపల్ కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమం నిర్వహించిన సంఘటనపై కొందరు కౌన్సిలర్లు దురుసుగా వ్యవహరించి, దుర్భాషలాడడాన్ని ఖండించారు. కాగా రాష్ట్రనాయకుల సమక్షంలో చర్చలు జరపా లన్న కార్మికుల విన్నపాన్ని కమిషనర్ ఏకీభవించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. ఈ కార్య క్రమంలో కార్మిక సంఘం నాయకులు మహేష్, కేశవులు, నరసింహ, అంజమ్మ, అలివేలు, యాదమ్మ, స్వరూప, శ్యామల, యాదయ్య, చంద్రమౌళి, శంకర్, రాజు, శివకుమార్, కార్మికులు పాల్గొన్నారు.



జడ్చర్ల మునిసిపల్ కార్యాలయం ముందు వంట, వార్పు కార్యక్రమం చేపట్టిన కార్మికులు

పరిహారం ఇవ్వాల్సిందే

- ఆర్డీవో కార్యాలయంలో మహిళ ఆందోళన



తనకు న్యాయం జరిగే వరకు కదలనని పోలీసులకు దండం పెడుతున్న మహిళ

గద్వాల, ఆగస్టు 13 : ర్యాలంపాడు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన తన పొలం, ఇంటికి పరిహారం అందించాలని అలూరు గ్రామానికి చెందిన తిమ్మలమ్మ ఆర్డీవో కార్యాలయంలో ఆందోళన చేపట్టింది. ఆర్డీవోతో పాటు అధికారులను నిలదీసింది. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ర్యాలంపాడు రిజర్వాయర్‌లో ఆమె పొలంతో పాటు ఇల్లు, వాకిలి ముంపునకు గురయ్యాయి. 2018లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేయడంతో గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయాల్సి వచ్చింది. ముంపునకు గురైన ఇళ్లకు పరిహారం అందిస్తే తప్ప ఖాళీ చేయబోమని గ్రామస్థులు తేల్చి చెప్పారు. దీంతో అధికారులు సర్వే చేశారు. ఇళ్లను ఖాళీ చేసేందుకు ఒక్కొక్కరికి రూ.40వేల చొప్పున ఇచ్చారు. మిగిలిన మొత్తం రెండవ దఫాలో ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత పరిహారానికి ఎంపికైన ఇళ్లపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ విచారణ చేయించారు. అందులో 73 మంది మాత్రమే అర్హులని తేల్చి, వారికి రెండవ విడుత పరిహారం ఇస్తున్నారు, మరో 20 మందికి పైగా అప్పటికే పరిహారం అందిందని తేల్చారు. మరో ఐదు గురికి సంబంధించిన స్థలం మీదుగా రోడ్డు వెళ్లిందని, మిగిలిన వారు అనర్హులని తేల్చారు. అందులో తిమ్మలమ్మ కుమారులు మల్లి కార్జున్, శ్రీనివాసులు ఉన్నారని ఆర్డీవో కార్యాలయ అధికారులు స్పష్టం చేశారు. దీంతో కార్యాలయంలో ఆందోళనకు దిగింది. తాము అర్హులమే అని, ఎవరో కావాలని పరిహారం రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించింది. పరిహారం ఇవ్వాల్సిందేనని భీష్మించుకొని కూర్చొంది. చివరకు మహిళా పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను అక్కడి నుంచి తీసుకెళ్లారు.

ఫుడ్‌పాయిజన్‌కు కారణమైన హాస్టళ్ల ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలి



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

పాలమూరు, ఆగస్టు 13 : జడ్చర్ల మైనారిటీ బాలుర గురుకుల, నంచర్ల బాలికల ఎస్సీ గురుకులాల్లో విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్‌కు కారణమైన ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆది విష్ణు మాట్లాడుతూ ఆగస్టు ఏడున జడ్చర్ల బాలుర మైనారిటీ గురుకులాల్లో విద్యార్థులకు నాసిరకమైన టిఫిన్ తినటంతో వాంతులు చేసుకున్న విషయం పాఠకులకు తెలిసిందేనన్నారు. దానికి కారణమైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, కేశవులు, మనోహర్, సురేష్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని మోతీనగర్ సమీపాన రైలు పట్టాల పక్కన గాయాలతో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తించి స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. రైలు ఢీకొనడం వల్ల గాయాలైనట్లుగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని మార్చ్యురీలో భద్రపరిచారు. కేసు నమోదుచేసుకుని రైల్వే ఎస్సై అక్బర్ దర్యాప్తు చేస్తున్నారు.

నల్లబెల్లం పట్టివేత

- పలువురిపై కేసు నమోదు

నవాబ్‌పేట, ఆగస్టు 13 : కిరాణం షాపులో నల్లబెల్లం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు బెల్లం కాటన్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి ఆదేశానుసారం మంగళవారం మండల కేంద్రానికి చెందిన శ్రీశైలం అనే వ్యక్తి తన కిరాణం షాపులో కొంతకాలంగా నాటుసారాకు వాడే నల్లబెల్లాన్ని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో మహబూబ్‌నగర్, పర్గి (వికారాబాద్) జిల్లాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించారు. మండలంలోని కిష్టంపల్లి తండాలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకుని అక్కడకు వెళ్లి ఐదు లీటర్ల నాటుసారాను పట్టుకుని సదరు వ్యక్తులను విచారించగా నవాబ్‌పేటలో నల్లబెల్లం తీసుకువస్తున్నామని చెప్పడంతో నవాబ్‌పేటలో తనిఖీలు నిర్వహించి 144 కిలోల నల్లబెల్లం కాటన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐలు వీరారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఐలు విక్రం, కరుణ, దయానంద్, సిబ్బంది రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

వంగూరు, ఆగస్టు 13: మండలంలోని డిండిచింతపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మంగళవారం తెల్లవారుజామున పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. పట్టుపడ్డ ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వాగుల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఆర్ఐటీఐ కోర్సుల్లో మిగులు సీట్లకు ప్రవేశాలు

మన్ననూర్, ఆగస్టు 13: అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఆర్ఐటీఐ)లో 3వ విడత మిగులు సీట్లను పూరించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి అంతర్జాలంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐటీఐ ప్రిన్సిపల్ లక్ష్మణ స్వామి తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కోపా, మోటారు వెహికిల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సుల్లో దరఖాస్తు చుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 17లోగా ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను మొబైల్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అనంతరం కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థుల ఎంపిక నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

మన్యంకొండలో వీరభద్ర స్వామికి పూజలు

మహబూబ్‌నగర్ రూరల్, ఆగస్టు 13 : మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారికి సన్నిధిలో ఉన్న వీరభద్రస్వామికి శ్రావణ మాస సోమవారం పర్వదినం సందర్భంగా ఉదయం వీరభద్ర స్వామికి ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో 41 రోజులు అఖండ జ్యోతి ప్రజ్వలనతో, అగ్నిగుండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకుల వేద మంత్రాలతో, అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న అలయ ధర్మకర్త అళహరి మధుసూధన్ కుమార్

కారు అదుపు తప్పి నలుగురికి గాయాలు

గోపాల్‌పేట, ఆగస్టు 13 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్ర సమీపంలో ఓ కారు అదుపు తప్పడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలంలోని కిష్టగిరి గ్రామానికి చెందిన ఓ కుటుంబం హైదరాబాద్ నుంచి ఏదుల మండలం మాచుపల్లి గ్రామంలో జరిగే ఓ వివాహానికి హాజరయ్యేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో గోపాల్‌పేట మండలం ధన్‌సింగ్‌తండా వద్ద కారు అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. కారు ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. వాహనదారులు, పోలీసులు గాయపడ్డ వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసం అయ్యింది.

వసతి గృహాల్లో బయోమెట్రిక్ నమోదు

▸ 16వ తేదీ నుంచి అమలు చేయాలి ▸ కలెక్టర్ బీఎం సంతోష్



చింతలపేటలోని ఎస్సీ-ఏ వసతి గృహంలో విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్/ గద్వాల టౌన్, ఆగస్టు 13 : వసతిగృహాల్లో విద్యార్థులకు ఈ నెల 16 నుంచి బయోమెట్రిక్ యంత్రంలో హాజరు నమోదు చేయించాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. స్థానిక ఎస్సీ, బీసీ, సంక్షేమ శాఖల వసతి గృహాలు, గంజిపేటలోని బీసీ-బీ హాస్టళ్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులతో పాఠం చదివించి, సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం ప్రతీ రోజు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అనంతరం వంట గదులను, భోజనశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మరుగుదొడ్లను, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. విద్యార్థులందరినీ ఒకే దగ్గర కాకుండా, తరగతుల వారిగా విభజించి విడివిడిగా ఉండేలా చూడాలన్నారు. వసతిగృహాల తలుపులు, కిటికీలను మరమ్మతు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి రమేశ్‌బాబు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ అధికారులు సరోజ, వార్డెన్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పరిశీలన

గద్వాల పట్టణంలోని ప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కలెక్టర్ బీఎం సంతోష్ మంగళ వారం పరిశీలించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈవీఎంలను ఇదే కళాశాలలో భద్రపరచినప్పుడు తరగతి గదుల్లో కొన్ని మార్పులు చేశారని వారు ఆయనకు తెలిపారు. దీనివల్ల తరగతుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రిన్సిపాల్ వివరించారు. బందోబస్తు కోసం కొన్ని సైడ్ వాల్స్‌ను తొలగించారని తెలిపారు. వాటినన్నింటిని తిరిగి నిర్మించాలని కోరుతూ, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు సాయిశ్యాం రెడ్డితో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

బాలల సంరక్షణకు అందుబాటులో '1098'

▸ అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ



వడ్డేపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

వడ్డేపల్లి/ ఇటిక్యాల, ఆగస్టు 13 : బాలల సంరక్షణకు 24 గంటలు ఫోన్ నెంబర్ '1098' సేవలు అందుబాటులో ఉన్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం వడ్డేపల్లి మండలం రామాపురం, శాంతినగర్, ఇటిక్యాల మండలం మునగాల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ బాల్య వివాహం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. బాలకార్మికుల సమాచారం తెలిస్తే 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సీడీపీవో సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థునులు చదువుపై దృష్టి సారించాలన్నారు. రక్షణ, చదువు, వివక్ష, బాల్య వివాహాలు, శారీరక మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జి ఎంఈవో నరసింహ, వైద్యాధికారి స్వప్న, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, చైల్డ్‌లైన్ కేస్ వర్కర్, కానిస్టేబుల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎం, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

చదువుతో జీవితంలో సుస్థిర స్థానం

పట్టుదలతో చదువుకొని జీవితంలో సుస్థిర స్థానంలో నిలవాలని జీహెచ్‌ఎం వెంకటేశ్వర రావు అన్నారు. ఎంవీ ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో ఆధ్వర్యంలో మంగళవారం శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా 'బడి పిల్లలను పని పిల్లలు కానివ్వొద్దు' శీర్షికన రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098, 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ అధికారి (డీసీపీయూ ఓఆర్‌డబ్ల్యూ) లక్ష్మీదేవి మాట్లాడుతూ బాలల పరిరక్షణ కమిటీ, సంఘం నిర్మాణం, విధులు బాధ్యతలపై విద్యార్థినులకు వివరించారు. బాల్యం పిల్లల హక్కు అని, వారు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఉపాధ్యాయుడు సామేలు, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాలల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

బాలల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో సుజాత అన్నారు. ఇటిక్యాల మండలంలోని మునగాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహ్మద్ అజహర్ మొహియిద్దీన్ మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలు, బాలికలపై లైంగిక వేధింపులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్, అంగన్‌వాడీ టీచర్లు, బాలల పరిరక్షణ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.





అయిజ, మానవపాడులలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

▸ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి - గద్వాల పట్టణంలో బైక్ ర్యాలీ



జాతీయ జెండాకు వందనం చేస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి, నాయకులు

గద్వాల టౌన్/ మానవపాడు/ అయిజ, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి కోరారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్ రజక జయశ్రీ, నాయకులు దేవదాస్, అనీల్, చిత్తారి కిరణ్, వెంకట్రామిరెడ్డి, గీతారెడ్డి, రజక నరసింహ, తరుణ్, డబ్బిలేటి నరసింహ, మోహన్‌రెడ్డి, తిరుమల్, పవన్, వీరేష్‌రెడ్డి, రాజశేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

- ప్రతీ ఇంటిపై ఈ నెల 15న జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం అమరవాయి నుంచి మానవపాడు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని గాంధీ చౌక్ వద్ద హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి జాతీయ జెండా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బలరాంరెడ్డి, లక్ష్మీనారాయణ, శేఖర్, నాయుడు, రాఘవయ్య, జగన్, రమేశ్, పరమేష్, హంస్రేస్, శివాజీ, వెంకటేష్ పాల్గొన్నారు.

- అయిజ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమ్‌సేన్‌రావు, గోపాలకృష్ణ, నర్సింహయ్యశెట్టి, ప్రదీప్‌స్వామి, భగత్‌రెడ్డి, లక్ష్మణాచారి, రాజశేఖర్, లక్ష్మణ్‌గౌడు పాల్గొన్నారు.

సర్కారు బడులకు భద్రత కరువు

▸ జిల్లాలో ప్రహరీలు లేని 265 పాఠశాలలు ▸ సెలవులు వస్తే ఆకతాయిల ఆగడాలు



ధ్వంసమైన రాజోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ



ముండ్ల దిన్నె ప్రభుత్వ పాఠశాలలో చోరీకి గురైన కటికీలు

రాజోలి, ఆగస్టు 13 : సర్కార్ బడులకు రక్షణ కరువయ్యింది. జిల్లాలోని చాలా పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడం సమస్యగా మారింది. దీంతో బడికి సెలవులు వచ్చినప్పుడు ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. జిల్లాలో 284 ప్రాథమిక, 91 ప్రాథమికోన్నత, 85 ఉన్నత పాఠశాలలు, మొత్తం 460 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 265 పాఠశాలలకు ప్రహరీలు లేవు. మరో 105 పాఠశాలలకు ప్రహరీ ఉన్నా గేట్లు లేవు. దీంతో సెలవు రోజుల్లో ఆకతాయిలు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి తలుపులు, కిటికీలు, తరగతి గదుల్లో బెంచీలు, కుర్చీలను విరగ్గొడ్తున్నారు. ఆవరణలో మద్యం తాగి సీసాలు అక్కడే పారేస్తున్నారు. మరుసటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్తున్నారు. రాజోలి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ప్రతీ ఆదివారం మరుసటి రోజు మద్యం సీసాలు, సిగరెట్ పీకలు కనిపిస్తున్నాయి. తుమ్మలపల్లి ప్రభుత్వ పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికలకు ముందు రోజు ముండ్లదిన్నె ప్రభుత్వ పాఠశాల కిటికీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లారు. ఈ ఘటనకు పాల్పడిన దుండగలను ఇప్పటి వరకు గుర్తించలేదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అన్ని పాఠశాలలకు ప్రహరీ నిర్మించాలని, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలకు భద్రత కల్పించాలి




మన్సూర్‌మియ్య, మాన్‌దొడ్డి : పాఠశాలకు సెలవు వస్తే చాలు ఆకతాయిలు పాఠశాల ఆవరణను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. దీంతో మరుసటి రోజు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, పాఠశాలలకు భద్రత కల్పించాలి.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి



భాస్కర్, రాజోలి : ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ లేదు. నైట్ వాచ్‌మన్‌ను నియమించలేదు. దీంతో ఆకతాయిలు తరగతి గదుల్లో సామగ్రిని ధ్వంసం చేస్తున్నారు. మద్యం తాగి సీసాలను అక్కడే పారేసి వెళ్తున్నారు. అధికారులు స్పందించి, ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి.

పాఠశాలలకు భద్రత కల్పిస్తున్నాం



'మన ఊరు- మన బడి' కార్యక్రమానికి ఎంపికైన పాఠశాలలకు ప్రభుత్వం ప్రహరీలు నిర్మించింది. ఎంపిక కాని పాఠశాలలకు ఉపాధి హామీ నిధులతో ప్రహరీల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తున్నాం. అన్ని పాఠశాలలకు త్వరలో స్వీపర్లను నియమించనున్నాం. బడుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

\- నర్సింహులు, ఎంఈవో

జోగుళాంబ సన్నిధిలో అదనపు కలెక్టర్



అదనపు కలెక్టర్ దంపతులను ఆహ్వానిస్తున్న ఈవో పురేందర్‌కుమార్

అలంపూర్, ఆగస్టు 13 : అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేశారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు శేష వస్త్రాలు అందించి సత్కరించారు. అంతకుముందు వీరికి ఈవో పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ సాదర స్వాగతం పలికారు.

జాతీయ సమైక్యతను కాపాడుకుందాం

▸ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



జాతీయ పతాకాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, అధికారులు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 13 : ప్రతీ ఇంటి గుమ్మంపై జాతీయజెండాను ఎగురవేసి జాతీయ సమైక్యతను కాపాడుకుందామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. తపాలశాఖ సహాయ పర్యవేక్షకుడు ఎల్. సైదానాయక్, సిబ్బందితో కలిసి మంగళవారం కర్నూలులోని చల్లా బంగ్లాలో ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. వారికి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పంపించిన లేఖను ఆయనకు అందించారు. హర్ ఘర్ తిరంగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్ ఆఫీసర్లు రవిచంద్ర, ఇమామ్‌వలీ, పుల్లూరు జలీల్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

▸ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్

మల్దకల్, ఆగస్టు 13 : ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తే అధిక దిగుబడులు పొందొచ్చని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్ రైతులకు సూచించారు. మల్దకల్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, మినుము సాగులో నిర్వహణా పద్ధతులను ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ భద్రు వివరించారు. పంట సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. సమావేశంలో ఏవో రాజశేఖర్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే చికిత్స చేయాలి

▸ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనారాణి

ఎర్రవల్లి, ఆగస్టు 13 : గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రథమ చికిత్సా కేంద్రాల్లో నిబంధనల మేరకు చికిత్స చేయాలని మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనా రాణి ఆదేశించారు. మండల పరిధిలోని కొండేరు గ్రామంలోని రెండు ప్రథమ చికిత్స కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఒక ప్రథమ చికిత్సా కేంద్రాన్ని మూసివేయించారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మధుసూదన్‌రెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలను నమోదు చేయాలి

▸ మల్దకల్ ఎంఈవో సురేశ్

మల్దకల్, ఆగస్టు 13 : మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో సురేశ్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మల్దకల్ ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల సంఖ్య, ప్రతీ రోజు హాజరు వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి నరేష్, హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

▸ గద్వాల మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల టౌన్/ గద్వాల, ఆగస్టు 13 : పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అధికారులకు సూచించారు. పట్టణ సమీపంలోని జములమ్మ ఫిల్టర్ బెడ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటి శుద్ధి ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. తాగునీటి సరఫరాలో లీకేజీలు ఉండకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చైర్మన్ వెంట మునిసిపల్ కమిషనర్ దశరథ్, డీఈ, ఏఈ, నాయకులు నాగులు యాదవ్, రామయ్య, జనార్దన్ ఉన్నారు.

జములమ్మను దర్శించుకున్న మునిసిపల్ చైర్మన్

జమ్మిచేడు జములమ్మ దేవతను మంగళవారం గద్వాల మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, మాజీ చైర్మన్ కుర్వ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలను అందించి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం పరశురాముడి ఆలయంలో పూజలు చేశారు.

జీవో నెంబర్ 60 ప్రకారం జీతాలివ్వాలి

▸ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమస్యలను వివరిస్తున్న కార్మికులు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 13 : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా ఇవ్వకుండా కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. డీఎంఈ సర్క్యులర్ ప్రకారం 220 బెడ్లకు 100 మంది వర్కర్లను నియమించుకునేందుకు సూపరింటెండెంట్, కలెక్టర్ అనుమతి ఇవ్వాలని కోరారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి పరశు, కార్మికులు చామంతి, లక్ష్మణ్, మతిన్, బాషా, వెంకటేశ్వరి, కన్నా పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన గొంగళ్ల రంజిత్‌కుమార్



మాజీ మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న గొంగళ్ల రంజిత్‌కుమార్

గద్వాల, ఆగస్టు 13 : నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న ఆయన స్వగృహంలో కలిశారు. రంజిత్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరేందుకు కొద్దిరోజులుగా ప్రయత్ని స్తున్నారు. అందులో భాగంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లను కలిశారు. వారి సూచన మేరకు సీనియర్ నాయకులు రంగం జైపాల్‌రెడ్డి, ఇంతియాజ్‌తో కలిసి కేటీఆర్‌ను కలిసి మాట్లాడారు. బుధవారం మరోమారు కలిసేందుకు కేటీఆర్ వారికి సమయం ఇచ్చారు. రంజిత్‌కుమార్ వెంట నడిగడ్డ హక్కుల పోరాట సమితి కో కన్వీనర్ బుచ్చిబాబు ఇతర నాయకులు ఉన్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

▸ ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు అలీఅక్బర్

అలంపూర్ ఆగస్టు 13 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని ప్రజానాట్య మండలి గద్వాల జిల్లా అధ్యక్షుడు అలీ అక్బర్ కోరారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం అతిథి గృహంలో మంగళవారం శౌర్య యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి నుంచి 17వ తేదీ వరకు ప్రజా నాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శౌర్య యాత్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ నాలుగవ తేదీన అలంపూర్ పట్టణంలో కళా ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా షేక్ కలందర్ బాషా

గద్వాల టౌన్, ఆగస్టు 13 : స్థానిక ప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ షేక్ కలందర్ బాషా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఎస్‌జే సంపత్‌కుమార్ బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ షేక్ కలందర్ బాషాను ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ తెలంగాణ ఉన్నత విద్య కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

శాంతినగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమా ఓబులేష్

వడ్డేపల్లి, ఆగస్టు 13 : శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా డాక్టర్ కె. రమా ఓబులేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు స్వాగతం పలికిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్‌జే సంపత్ కుమార్, డాక్టర్ ఎస్.ఏడుకొండలు, రాఘవేంద్ర, జీవ జయరాజ్, వెంకటేష్, ఈరన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, ఆగస్టు 13 : పట్టణ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాలను మార్చడం, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఈ నెల 14న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. దీంతో దౌదర్‌పల్లి, పిల్లిగుండ్ల కాలనీ, అయిజ రోడ్డు, మెడికల్ కళాశాలతో పాటు భీంనగర్, కృష్ణవేణిచౌక్, రాజీవ్‌మార్గ్, నల్లకుంటల, లింగంబాగ్ కాలనీ శ్రీనివాస కాలనీ, గంజిరోడ్డు, చింతలపేట, పెద్ద అగ్రహారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ

గద్వాల, ఆగస్టు 13 : గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఏఎస్పీ గుణశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారం రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం, అందులోని అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. మండల పరిధిలోని సంగాల గ్రామంలో ఫిల్టర్ ఇసుక రవాణా చేస్తూ ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందగా, రాళ్లను తరలిస్తూ మృతి చెందినట్లు పోలీసులు కేసు మార్చారని ఆరోపణలు వచ్చాయి. అందుకు పెద్ద ఎత్తున ముడుపులు అందాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై నిజానిజాలు తెలుసుకునేందుకు విచారణ జరుగుతోంది. దాని పురోగతిని తెలుసుకునేందుకు ఏఎస్పీ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ శ్రీకాంత్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, సాధారణ తనిఖీల్లో భాగంగా ఏఎస్పీ వచ్చారని తెలిపారు.